క్లుప్తంగా

రాజమహేంద్రవరం డీవైఈఓగా నారాయణ



డీవైఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా ఈవీవీఎస్ నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్‌గా ఆయన ఇప్పటి వరకూ పనిచేశారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా వచ్చారు. నారాయణను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు, కార్యదర్శి మంగిన రామారావు, డీవైఈఓ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఎస్‌కేఆర్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



శ్రీనివాస్

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ వివరాలను కళాశాల యాజమాన్యం శనివారం తెలిపింది. 87- 90 కాన్వకేషన్స్ 2023, సెంటసిస్ క్యాటరైజేషన్ అండ్ క్యాటలైటిక్ స్టడీస్ ఆఫ్ గ్రాఫేనే ఆక్సైడ్ కాపర్ ఫెర్రిటే నానో కాంపోజిట్స్‌పై ఆంధ్ర యూనివర్సిటీ నుంచి శ్రీనివాస్ పీహెచ్‌డీ అందుకున్నారు. ఆయన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

చంటియ్యకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పుల్లా చంటియ్య, చిత్రంలో యూనివర్సిటీ ప్రముఖులు

కడియం: కడియపులంకకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీ అధినేత పుల్లా సత్యనారాయణ (చంటియ్య) శనివారం డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు వివిధ రంగాల్లో అత్యున్నత సేవలందించిన వారికి డాక్టరేట్లు ప్రదానం చేశారు. పర్యావరణ రక్షణలో ముఖ్య భూమిక పోషించినందుకు చంటియ్యను చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో డాక్టరేట్‌తో సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలందించిన డాక్టర్ పుల్లారావును సత్కరిస్తున్న స్టార్టప్స్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పాత బొమ్మూరు రోడ్డులోని వివేకానంద హాస్పిటల్‌లో జేసీఐ నగర స్టార్టప్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వారోత్సవాల సందర్భంగా ఏర్పాటైన ఈ శిబిరంలో డాక్టర్ కె.పుల్లారావు వైద్య సేవలు అందించారు. 140 మందికి వైద్య పరీక్షలు అందించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జేసీఐ స్టార్టప్స్ ప్రెసిడెంట్ మోహన ప్రియ మాట్లాడుతూ జేసీఐ వీక్‌లో భాగంగా తొలిరోజు ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం డాక్టర్ పుల్లారావును సత్కరించారు. సెక్రటరీ జేసీ పావని పద్మావతి, సభ్యులు కోదండరామ్, దుర్గాభవాని, మురళి, ఆర్య పాల్గొన్నారు.

ఆదియోగి విగ్రహావిష్కరణ



కడియం శివాలయంలో ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహం

కడియం: స్థానిక శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆదియోగి రూపంలో ఉన్న పరమశివుని విగ్రహాన్ని శనివారం వేదమంత్రోచ్చారణల మధ్య ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన దాత వట్టికూటి వెంకటరమణ, సత్యసాయిరామ్‌ప్రసాద్ (బుల్లిబాబు) సోదరులు తమ తల్లిదండ్రులు దివంగత అప్పారావు, గంగవేణి జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శ్వేత వర్ణంలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు గిరజాల వీర్రాజు (బాబు), రామకృష్ణతులసి దంపతులు, ఆర్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ముంపు... ముందుందు ఉండదిక

- సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు
- రూ.50 కోట్లతో డ్రైన్ల నిర్మాణం
- రూ.7 కోట్లతో షిర్డీసాయి మార్గ్ కాలువ పనులు



శ్యామలా సెంటర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు



గోకవరం బస్టాండ్ రోడ్డులో ప్రధాన కాలువ నిర్మాణం

సీటీఆర్ఐ: చినుకు చికాకు రప్పిస్తోంది.. ముంపు సమస్యను వెంట తీసుకొస్తుంది.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోని పలుచోట్ల ఈ సమస్య తీవ్రంగా ఉంది.. నగరంలో ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే దీనికి కారణం. కొన్నిచోట్ల డ్రైనేజీలు శిథిలం కావడం, మరి కొన్నిచోట్ల చిన్నగా ఉండడం సమస్యను పెంచుతోంది. ఈ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించే దిశగా నగరపాలక సంస్థ కార్యాచరణ సిద్ధం చేసింది. కొన్నిచోట్ల కాలువలను వ్యాపారులు పూర్తిగా ఆక్రమించారు. వీటిపై వ్యాపార సంబంధమైన వస్తువులు, ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. డీలక్స్ సెంటర్, శ్యామలా థియేటర్, స్టేడియం రోడ్డులో వ్యాపార సంస్థలు కాలువలను పూర్తిగా మూసివేస్తూ మెట్లను నిర్మించారు. దీంతో వర్షం పడినప్పుడు ముంపు నీరు కాలువల నుంచి వెళ్లడానికి అవకాశం లేకుండా పోతోంది. కాలువలపై ఏర్పాటు చేసిన మెట్లను పూర్తిగా తొలగిస్తేనే కాని అక్కడ మురుగు, వర్షం నీరు వెళ్లే పరిస్థితి లేదు. ఈ సమస్యలపై కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ స్పందించారు. గురువారం స్వయంగా ఆయన ఈ పనులను పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సహాయ ఇంజినీర్లకు కమిషనర్ దినేష్ కుమార్ డ్రైనేజీ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

శరవేగంగా పనులు

స్థానిక డీలక్స్ సెంటర్, శ్యామలా థియేటర్ జంక్షన్‌లో జరుగుతున్న డిసిల్టేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరంలో రూ.50 కోట్లతో డ్రైన్లు నిర్మిస్తున్నారు. రూ.7 కోట్లతో షిర్డీసాయి మార్గ్‌లో కాలువ నిర్మాణం పూర్తి కావొస్తుంది. గుండువారి వీధి, శ్యామలా థియేటరు, డీలక్స్ సెంటర్, గోదావరి గట్టు అనుకున్న రోడ్లలో కాలువల ఆధునీకరణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అమృత్ పథకంలో నిర్మించిన కాలువలను అనుసంధానిస్తూ రూ.96 లక్షలతో కాలువలను నిర్మిస్తున్నారు. శ్యామలా థియేటర్ సెంటర్‌లో కాలువలను ఆధునీకరించడానికి, సిల్టును ఎప్పటికప్పుడు సులువుగా తొలగించడానికి వీలుగా డ్రైన్లపై ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు వేయడానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలోనే వాటికి సంబంధించిన పనులు చేపడతారు. దేవీచౌక్ నుంచి గోకవరం బస్టాండ్ వెళ్లే మార్గంలో ప్రధాన కాలువను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. 550 మీటర్ల పొడవున్న ఈ కాలువ కోసం రూ.1.7 కోట్లు ఖర్చు చేస్తున్నారు.



శాశ్వత పరిష్కారానికి చర్యలు

నగరంలో ముంపు సమస్య నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాం. ఇప్పటికే కొన్ని నిర్మాణంలో ఉండగా మరి కొన్నింటికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఆక్రమణలకు గురైన కాలువలపై నిర్మాణాలను తొలగించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ప్రత్యక్షంగా చూసి అధికారులకు సూచనలు ఇస్తున్నాం.

– కె.దినేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్

‘స్కిల్’ స్కామ్‌లో చంద్రబాబుదే ప్రధానపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సీటీఆర్ఐ: ‘స్కిల్’ స్కామ్‌లో చంద్రబాబుదే ప్రధానపాత్ర అని, అందుకే అతన్ని అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సిటీ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరితో కలసి ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తానని చెప్పి ఇంత పెద్ద స్కామ్‌కు చంద్రబాబు పాల్పడ్డారన్నారు. సీమెన్ కంపెనీ రూ.3 వేల కోట్లు వెచ్చిస్తామని చెప్పింది కాని ఒక్క రూపాయి కూడా పెట్టలేదన్నారు. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం తరఫున రూ.371 కోట్లు షెల్ కంపెనీకి ఇచ్చారన్నారు. ఇది ఒక్కటే కాదని చంద్రబాబు హయాంలో అనేక స్కామ్‌లు జరిగాయని, అవి త్వరలో బయటకు వస్తాయన్నారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ అమరావతి స్కాం, ఈఎస్ఐ స్కాం కూడా చంద్రబాబు ఖాతాలో ఉన్నాయన్నారు. ఈ అక్రమాలతో చంద్రబాబు కోట్లాది రూపాయలు ఆర్జించారన్నారు. పార్లమెంట్ భవనం నిర్మించడానికి కేవలం రూ.900 కోట్లు అయితే చంద్రబాబు మాత్రం అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణం కోసం రూ.700 కోట్లకు పైగా ఖర్చు చేశారని అన్నారు. ఇంకా అమరావతి భూముల విషయంలో అవినీతికి హద్దు లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు అరెస్ట్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అంటూ గోల చేస్తున్నారని, ఈ కేసు 2017లోనే నమోదైందన్నారు. కక్ష సాధింపు అయితే ఇన్నేళ్లు ఎందుకు పడుతుందన్నారు. రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రె కొండబాబు, క్లస్టర్ ఇన్‌చార్జులు మజ్జి అప్పారావు, ఆర్యాపురం రమా సత్యనారాయణ స్వామివారి దేవాలయ కమిటీ డైరెక్టర్లు బసరబోయిన విజయశంకర్, విస్సారపు కాశీవిశ్వనాథ్, నాయకులు ఉప్పాడి కన్నారావు, వంకాయల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- అంతా సమన్వయంతో సాగాలి
- నియోజకవర్గ పరిశీలకుడు రవీంద్రనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

సీటీఆర్ఐ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు వంకా రవీంద్రనాథ్ అన్నారు. శనివారం స్థానిక సిటీ కార్యాలయంలో వివిధ విభాగాల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, గృహ సారథులు, కార్యకర్తలు, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరితో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహించి నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల సీఎం జగన్ పాలనలో అనేక సంక్షేమ పథకాలను అర్హులకు అందించారన్నారు. దీంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, వారంతా వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను తిరిగి సీఎం చేయాలని చూస్తున్నారన్నారు. అమలు చేస్తున్న పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో గత ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి మరింత ప్రజలకు చేరువ కావాలన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ చాలా ఉత్సాహంగా ప్రజలను కలుస్తున్నారన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని వాటిని చక్కగా పరిష్కరిస్తున్నారన్నారు. డాక్టర్ గూడూరి మాట్లాడుతూ వంకా రవీంద్రనాథ్‌తో కలసి సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. సలహాలు ఎవరు ఇచ్చినా పార్టీకి మంచి జరుగుతుందంటే స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఈబీ విస్తృత దాడులు

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ సౌత్ స్టేషన్ సిబ్బంది, టాస్క్ ఫోర్స్ శనివారం పాతతుంగపాడులో సారా బట్టీలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఆ గ్రామానికి చెందిన అత్తిలి చంద్రరావును అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సౌత్ స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అత్తిలి ప్రసాద్ సారా తయారీతో పాటు అమ్మకాలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

ఆసుపత్రిలో తనిఖీలు



గోకవరం ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని శనివారం డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రిలో సదుపాయాలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించి త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ వనజ, ఆరోగ్యమిత్ర దాసరి కాశీ తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- అవినీతి గుర్తించాకే చంద్రబాబు అరెస్ట్
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: చట్టానికి ఎవరూ అతీతులు కాదని చంద్రబాబు అరెస్టునుద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. టీడీపీ హయాంలో తీసుకొచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్‌లో వందల కోట్ల అవినీతి జరిగిందంటూ అందిన ఫిర్యాదులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారన్నారు. దర్యాప్తు సంస్థల విచారణలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడడంతో పాటు కొన్ని షెల్ కంపెనీల ద్వారా హవాలా రూపంలో విదేశాలకు సొమ్ము మళ్లించినట్లు గుర్తించారన్నారు. అందుకే సీఐడీ పోలీసులు చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. టీడీపీ నాయకులు చంద్రబాబు అరెస్ట్‌ను చూపి ప్రజల్లో సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఈ అరెస్ట్ వెనుక రాజకీయ దురుద్దేశం ఉందంటూ టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అనపర్తి పర్యటనకు వచ్చిన చంద్రబాబు తనపై నిరాధారమైన అనేక అవినీతి ఆరోపణలు చేశారని, చంద్రబాబు తనపై చేసిన ఆరోపణలు నేడు గురివింద సామెతను గుర్తుకు తెస్తున్నాయన్నారు. సమావేశంలో సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

తగినన్ని సీట్లు కేటాయించే పార్టీకే ఓటు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరిపోగు వెంకటేశ్వరరావు
- అచ్చన్నపాలెంలో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పేరిపోగు వెంకటేశ్వరరావు

నల్లజర్ల: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 23 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలను మాదిగలకు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పేరిపోగు వెంకటేశ్వరరావు కోరారు. మాదిగల ఆత్మీయ సమావేశాన్ని శనివారం సాయంత్రం అచ్చన్నపాలెంలోని కాకర్ల గంగరాజు కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పేరిపోగు మాట్లాడుతూ తాము కోరిన విధంగా సీట్లు కేటాయించే పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి పార్లమెంట్ ఆమోదానికి పంపాలని కోరారు. విజయవాడలో నిర్వహించే మాదిగల యుద్ధభేరి కార్యక్రమానికి మాదిగ సోదరులందరూ హాజరు కావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఉభయ గోదావరి జిల్లా ఇన్‌చార్జ్ గెల్లా వెంకట శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి వెంకట్రాజు, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి రాంబాబు, నాయకులు గేర శ్రీనివాస్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ కొడవటి బుజ్జిబాబు, గాలింకి రాంబాబు, ప్రకావరావుపాలెం ఎంపీటీసీ సభ్యుడు నేకూరి రాజేస్, మద్రి శోభన్ బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



బాలికలకు ఆరోగ్యం - పరిశుభ్రతపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ హేమనళిని

రాజానగరం: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని, ముఖ్యంగా కౌమార దశకు చేరుకున్న బాలికలు ఈ విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాలని డాక్టర్ హేమనళిని సూచించారు. మండలంలోని రాధేయపాలెంలో కౌమార దశ బాలికలకు, యువతులకు ‘ఆరోగ్యం – పరిశుభ్రత’ పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ (దివాన్‌చెరువు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై బాలికలను చైతన్యపరిచారు. గర్భిణులకు సరైన నిద్ర, పౌష్టికాహారం, ప్రసవానంతరం నవజాత శిశువుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ



దత్త ఆశ్రమంలో పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చేరువలో ఉన్న దత్త ఆశ్రమంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌జీఎస్ భజనామృత సత్సంగం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పారాయణ నిర్వహించారు. అనంతరం ప్రసాదం వితరణ చేశారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక నిరంతర ప్రక్రియ



లబ్ధిదారులకు నూతన పెన్షన్లు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య

ఉండ్రాజవరం: పింఛనుకు అర్హత సాధించిన వారి వివరాలను వలంటీర్లు సేకరించి అప్‌లోడ్ చేస్తే ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరవుతాయని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. మండలంలోని తాడిపర్రులో నూతనంగా మంజూరైన 25 పింఛన్లను శనివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి మాట్లాడుతూ పింఛన్ల ద్వారా సీఎం జగన్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికే దఫదఫాలుగా పింఛను పెంచుతూ రూ. 2,750 చొప్పున అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, గరిమెళ్ళ తాతారావు, గారపాటి లచ్చయ్య, మారిశెట్టి నర్సింహ, ఏనుగపల్లి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం: నగరంలో ఎలాంటి అసాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ పి.జగదీష్, సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, వారి స్టేషన్ సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని ముఖ్య ట్రాఫిక్ జంక్షన్లలో ఈ నాకాబందీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కమిటీ కో చైర్మన్‌గా చిట్టిబాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కమిటీ కోచైర్మన్‌గా బి.చిట్టిబాబు ఎన్నికయ్యారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహ సమావేశ మందిరంలో శనివారం ఏపీజీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఇందులో టీచర్స్ గిల్డ్ సంఘం నుంచి చిట్టిబాబు ఎన్నికయ్యారు. దీనిపై రాష్ట్ర టీచర్స్ గిల్డ్ జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ధవళేశ్వరంలో ‘నా భూమి- నా దేశం’



ధవళేశ్వరంలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ధవళేశ్వరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు మేరకు శనివారం ధవళేశ్వరంలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో అమర వీరులకు గుర్తుగా నిర్మిస్తున్న అమృతవనంలో దేశంలో ప్రతి ఇంటి నుంచి చిటికెడు మట్టి సేకరిస్తున్నామని వెంకట్రావు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎన్వీ ఆచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ గండేపల్లి కొండలరావు, ఒంటిద్దు స్వామి, కందుకూరి మనోజ్‌బాబు, కోన సతీష్, గుజ్జుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి పరామర్శ



సచివాలయ ఉద్యోగి వినోద్‌కుమార్‌ను పరామర్శిస్తున్న కాకర్ల వెంకటరామిరెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన స్థానిక 35వ సచివాలయ ఉద్యోగి జి.వినోద్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి శనివారం ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరామర్శించారు. వినోద్‌కుమార్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే అందుబాటులో ఉన్న ఉద్యోగ సంఘాల నాయకులకు తెలపాలన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని చెప్పారు. దీనిపై గ్రామ వార్డు శాఖ పెద్దల వద్దకు తీసుకువెళ్లి పని ఒత్తిడి తగ్గేలా చూస్తామని వినోద్‌కు ఆయన భరోసా ఇచ్చారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు విప్పర్తి నిఖిల్‌కృష్ణ, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ ప్రెసిడెంట్ రవితేజ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర తదితరులు ఉన్నారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నాం: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శనివారం ఆయన స్థానిక నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ కేసులు, అరెస్టులకు భయపడే పార్టీ టీడీపీ కాదని అన్నారు. పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి యర్రా వేణుగోపాల్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.